# దోమరాజా!

భమిడిపాటి కామేశ్వరరావు

దోమలమాట చెబుతా! పక్షికిలాగ రెక్కలు రెండూ ఏనుక్కిమల్లే తొండం ఒకటీ భగవంతుడు కట్టబెట్టాడూ! పండితులంతా విధంచెడి ఏకమై ఏనుగుతో జోడించి సమాసించారూ! వృత్తిరహితదీపా లొచ్చి వహ్నిశలభ న్యాయాన్ని రద్దుచేస్తున్నాయీ! మునిసిపాలిటీలు జనంయొక్క నీటియిబ్బంది గమనించి జనానికి ఇన్నినీళ్లు వదులుకుని, తద్వారా పగటివేళకూడా పనికలిపించాయీ! ఇవతల వాళ్లకి — దానిమొహం ఈడ్చా — చెముడనేది ఉందో లేదో కాస్త కనుక్కోడమేనా లేకుండా అడ్డంపడి చెవులుకొరకడం సహజంగా చేతవునూ! ఇహ, దోమలు మిడిసిపడ్డాయీ అంటే, వింతేమిటి విడ్డూర్యమేమిటి నామొహం! ఇంత కమా మిషున్నప్పుడు వాటిని మిడిసేనాపడకుండా చావమన్నారా ఏమిటి! వాటి ప్రయోజకత్వానికి సాయం అవి ఏమూలో పడి ఉండకూడదూ అని కొందరు కోప్పడేది. కాని అది వ్యర్థకోపం. మూలాధారంగా ఉండే పదార్థాలు వ్యాపకం కాకమానవు పోనీ అందుకు ఒప్పగో వచ్చుగాని, రాత్రింబగళ్లు నిద్రలేకుండా (ఆహారం లేకేం రోగం, బోలెడుంది!) వీటిని అనవసర సంచార ప్రచారాలు సాగించమని ఏడ్చినవాడెవడయ్యా, అని కొందరిప్రశ్న. కాని, ఏం చెప్పగలం? ఎవరికి ఎంతముట్టాలో అంతా ముడితేగాని ఊరుకోరు మరి. మానవజాతి తమరికి బాకీఉన్న తిట్లూ చెంపపెట్లూ అణాపైసల్తో వసూలుచేసు గోవాలని దోమల ఏడుపు గావును! అదీకాక, చేతుల్ని రెక్కలు అనికూడా పిలుస్తూంటారని గావును మానవులే ఎగిరిపడేవాళ్లంటూన్నప్పుడు దోమలు ఆగుతాయా, వాటిని ఎవరేనా ఆపగల్తుమా! అన్నట్టు, మానవుల్ని చెవులట్టుకుని ఆడించగలంగదా అని ఈదోమలకి ఎంతగర్వం అనుకున్నారు, అవి రేపెట్టే రొదగా చెబుతూన్నా మనం వాటిని విసిరికొడతాంగాని! ఇంకోటిట! అవతల శివుణ్ణీ ఇవతల దోమల్నీ పెట్టి తూస్తేటా, ముల్లు దోమలవేపే చూపుతుందిట! ఎందుకంటేటా, శివుడు పుణ్యాత్ములికి మాత్రం, కాశీమరణం లభించినవారికిమాత్రం, కుడిచెవిలోమాత్రం, తారకోపదేశం తీరుబడినిబట్టి చేస్తే చేస్తాడట, లేకపోతే లేదుట! కాని, దోమలో! చివరికి దురాత్ములైనాసరే, అకాశీఅయినాసరే, మరణం లభించకపోయినాసరే, కుడీ ఎడమా లేకుండా, చెవిఅయినాసరే కాకపోయినాసరే, రాత్రి రెండోఝాం వేళయినాసరే – అవసరాన్నిబట్టి అప్పట్లో మరీభారీగా- అష్టతారకోపదేశం కాకపోతే లెక్కేమిటన్నాను – తారకం అంటేలాగు గీరకోపదేశం చేస్తేగాని సర్దణిగి ఊరుకోవుట!! పోనీ ఇదంతాకుడా సత్యమేనని ఒప్పుగుని ఇదవుదాంఅంటే మన్ని అవెక్కడ ఊరుకోనిస్తాయీ, పెట్టీమాటా! దోమలకి గాంధర్వంలో ప్రవేశంఉండడంవల్ల మానవులకి మరీ చావొచ్చిపడింది. అయ్యో, నమ్ముతారో లేటో, ఎల్లాగైతేం మహా ఆ అఖండగానం తమదేఅంటూ అవి ప్రకటించుగునే ప్రత్యేకపు బడాయి ఎన్ని పుట్లనుకున్నారు, వీటి బడాయి తంపబెయ్యా! దోమలకి పుట్టుకతోటే తాండవం ఉందిగనక, దోమగానాన్ని ఏదో మామూలు పక్షిగానంకింద జమకట్టి పారెయ్యక, మంచి యక్షగానంలాంటి నాటకవిశేషం అని, జనం ఒప్పుగుతీరక ఏం జేస్తారో చూస్తాంగా అని కొందరు దోమగానవిమర్శకులు వెనకవాంగుచేసి వీట్లకి హుషారీ ఇస్తున్నారు. పోనీ, విమర్శకులు ఏం జెయ్యగలవ్, ఏ ఒకదానికి స్థిరత్వంగాని, ఏ రెండింటికీ సమత్వంగాని, ఏ మూడింటికీ సాపత్యంగాని ఉండకపోడం సహజంగదా అని, గానప్రియులైనా రాయల్లా మాట్లాడకూరుకోకూడదూ, మనం బతిగిపోదుం!! వాళ్లు ఈ విషయంలో మరీ పుణ్యంకట్టుగున్నారు. దోమగానం మిక్కిలి ఉత్కృష్టంఅని వారు చచ్చుతెగేసి చెప్పి దాన్ని ఊహూ తెగపొగుడుతూండడం అల్లా ఉండ

గా, పైపెచ్చు ప్రతినిత్యమూ దోమనామస్మరణేనా చేస్తే పరానికేనా నయం అని తమలో తమరు ఒక రహస్య తీర్మానం చేసుకున్నారు. అందుకనే, ఈ రహస్యం తెలిసినవాళ్లంతా పాడేటప్పుడు తానంవగైరా మిమ కల్పించుకునీ, ఉత్తపుణ్యానికికూడా, "తద్దనోంద, దోంనోంద దోంద, దొ ఒ ఒ ఒ దొ ఓ ఒ ఓం దోం" అంటూ స్పష్టంగా దోమాంకితనాదం వినపడనిస్తారు. ఈ సంగతి మరి దోమలు ఏ రేడియోలో పసికట్టాయో మరీశ్రేగిపోయి, గాయకులే తమగానం మెచ్చింతర వాత మనుషుల లెక్కేమిటని చెప్పేసి, మానవులు కోరక పోయినాసరే, వద్దు పొమ్మన్నాసరే, మానకుండా, మానవులకి కోలీయేనా టిక్కెట్టు ఖర్చులేని గానకళ దేశకాలపాత్ర వివక్షతలులేకుండా విరివిగా ప్రసాదిస్తున్నాయి.

ఇంత అసంఖ్యాకంగా సృష్టింపబడ్డజంతువు వ్యర్థం అయిఉండదు, దీనిప్రయోజనం ఏమిటాఅని కొందరు దీర్ఘాలోచనలో ఉన్నారు. వెనక పాం కరిచిన ఒకమనిషిని దోమలువూగేసరికి అతడు నిద్దర్నించి లేచి కూచున్నట్టు కూచున్నాడట. దీనిసైజు వెనకటికంటే పెరిగిందనిన్నీ కేవలం పిచ్చిగంతపరిమాణం కొద్దికాలంలోనే పొందుతుందనిన్నీ కొందరు సూచించి, ఏ ఆహారం-రక్తంకాక-దానికి సప్లైచేస్తే అది యింకా విజృంభిస్తుందో చూస్తున్నారు. బస్తీలన్నింటిలోనూ ఈ జాతువు దండిగా పుట్టిపెరగడానికి సక్రమమైన ఏర్పాట్లు చేస్తూంటారు. అంచేత ఓ బస్తీకీ మరోబస్తీకి చేతిబంతి, కాలిబంతి, వాలిబంతి, క్రబంతి, తడకబంతిపోటీలు జరిగించినట్లే దోమబంతిపోటీలు పెట్టాలని కొందరు సెలవిచ్చారు. బస్తీదోమ, మురుసుదోమ, నాటుదోమ, లంకదోమ, మడదోమ — వగైరా దోమవిశేషాలపట్టీలు తయారుచేసి పంపిస్తే, వాటిల్లో మిక్కిలి పొడుగుపట్టీకి గొప్ప బహుమతీ ఇస్తాం అని ఒకపత్రికలో ప్రకటించడంవల్ల, ఆపత్రిక పత్రికంతా సమూలంగా అమ్ముడైపోయింది. కోడిపందాలులాగ దోమపందాలుకూడా వెనకేఉన్నట్టు ఒకశాసనంలో ఉన్న భావకి తన అర్థమనిన్నీ, తక్కినఅర్థాలు తీసేవాళ్లకి ఆలోచన నిండుకుందనిన్నీ ఒకరు అనుకుంటున్నారు. కిటికీవగైరాలకి కటకటాలు వేయించడం నిద్దరకిపడ్డ కళేబరాల్ని దోమలు బయటికి మోసెయ్యకుండా ఉండడానికే అని ఒకాయన ఈ మధ్య నొక్కి వాదించి ఇంగ్లీషులో ఆగ్రహించాడు. ఎగిరేస్వభావం ఈ జంతువుకి ఉందిగనక, కొద్దికాలం దీన్ని తరిఫీయతు గాని చేస్తే, ఖర్చులేని విమానం — 'కీ' యిస్తే పరిగెత్తే శకటంలాంటిది — తయారు కాకపోతుందా అని ఒక జపానీయుడు ఏకతలపోస్తున్నాడట! వేటలు అనేవి హిందూ సాంప్రదాయంలో చాలా ఉన్నాయనిన్నీ, దోమవేటలోకుడా ఆరితేరి ఖండాంతరాల్లో మెప్పులుపొందిన హిందూరాజకుమారులు ఉండేవారనిన్నీ చదువుకున్నవాళ్లు చెబుతూంటారు. వినకే, తత్తుల్యాలు ఇప్పుడూ ఉండచ్చు, దోమతెర్లు కట్టుకున్నవాళ్లు, లోపలజేరి, ఒకటే అరా దోమలనిమిత్తం రాష్ట్రకలహంలో ఉంటూంటే, తెరలుకట్టుగోడానికి తడిలేనివాళ్లు లోకక్షేమంనిమిత్తం మహాదోమ సంగ్రామంలో పనికొచ్చే బహిరంగపు దోమవేట అభ్యసిస్తూంటారు. పల్లెటూర్నించి బస్తీకి చుట్టం రావడం, అతనికి దోమతెర సప్లైకాకపోడం జరిగితే, అతడు యథాశక్తిగా వేట నేర్చుగుతీరాలి. దోమలూ నల్లులూ కొత్తమనుషుల్ని నిమిషంలో పోలుస్తాయి. కుక్కల్లాగ అవికూడా పసికడతాయోమో! రోజూ మనం కూర్చుంటూన్న పడకకుర్చీమీది నల్లులు మన్నికుట్టవ్; అంటే మనం స్వంతరక్తం ధారపోసి వాటిని పెంచుతున్నాం గనక మనయందు విశ్వాసం, అని కొంద రన్నారు. రక్తం మద్దే గనక, రక్తస్పర్శ ఉండబట్టి పీడన మాన్తాయని కొంద రన్నారు. కాని, పరాయివాడు వచ్చి, 'అమ్మయ్య' అంటూ సర్దుకోబోయేసరికి వాడికి వెంటనే అర్ఘ్యమిస్తాయి. దోమలధోరణీ అల్లాంటిదే. అప్పుడాపరాయివాడు 'మీరు ఈ బాధ ఎల్లా భరిస్తున్నారండీ' అంటాడు. 'అబ్బే, నన్నేమీ చెయ్యవండీ!' అంటాం మనం.

ఒకసారి ఒకబస్తీ స్నేహితుడింటికి ఆరుగురు వెళ్లారు. ఇద్దరికి దోమతెర సప్లై అయింది. కడంనలుగురూ మర్యాదకోసం ఇవతల చిక్కడ్డారు. చుట్టుపక్కల అడివి ఎదేనా లేగిందో ఏమో ఆరోజున దోమల పటాలాలు చాలా వచ్చాయట. వస్తూనే తెర ఇవతల

చిక్కడ్డ నలుగుర్నీ తణిఖీ ప్రారంభించాయి. కూచోనివ్వవ్, నుంచోనివ్వవ్, వెన్నువాల్చనివ్వవ్, కునుకోనిస్తాయా !! వీళ్లల్లో చిన్నపుణ్ణించీ ఉక్కురోషగాడు ఒకడున్నాడు. అతణ్ణి కొన్నొచ్చి కేటాయింపుగా పట్టుకున్నాయి. ఎవర్నైనా దోమలు ఆవహిస్తే ఓపట్టాన్ని వదలవ్ — నడిచినా, పరిగెత్తినా, వాహనం ఎక్కినా సరే వదలవ్! గంగలో దిగాలిగాని గత్యంతరం లేదు. రోకలి పుచ్చుకు దంచినట్టు పడిలేస్తూ అతని నెత్తిమీద ఓఇరవైయో ముప్ఫైయో సమావేశించి, మనిషిని దిగమడుపుకింప కట్టి ప్రదక్షిణాలు ప్రారంభించాయి. అతడు పళ్లు బిగించి వాటికేసి చూస్తూ వీలైనంత వడిగా ఇటూఅటూ పరుగు ప్రారంభించాడు. దోమతెరలో వాళ్లు, కళ్లుమూసుకునే ఉండి, 'అబ్బా! ఏముటోయ్! అల్లరీ! పరాయిసౌఖ్యం బొత్తిగా కిట్టదేమిటోయ్, నీకూ!' అని కేకేశారు. దాంతో అతని రోషానికి కారం రాసినట్టయింది. 'సరే లెండోయ్' అని, అతను కూర్చుని పుస్తకంతీసి చదవడం మొదలెట్టాడు. కీనీడని జేరి దోమలు అతనివీపు లగాయిస్తున్నాయి. కడంవాళ్లు, 'దీపం ఊకేస్తే దోమలు తగ్గుతాయి, దీపం తీసెయ్,' అన్నారు. ఎల్లాఅయితేం అతడు చదువుకోడానికి వీల్లేకుండా దీపం దిగదీశారు. గదంతా చీకటీ వెల్తురూ ఏదీకాకుండా అయి, అతనికి కేవలం సంధ్యైత్తినట్టయింది. ఈ దోసందులో ఒకదోమ రైంయ్యుమని గానంచేస్తూ విమానంలాగ అతని చెవిమీదుగా పోయి, అతని ముక్కుమీద వాలింది. అతను ఆసమయంలో తనకాలిమీద వాలబోతూన్న మరోకదోమని గమనిస్తున్నాడు. తక్షణం ముక్కుమీదది కుట్టింది. దాన్ని సాగదీసి కొట్టబోయేసరికి, తనముక్కు ఊడిపడేటంత దెబ్బ ఛెళ్లున తనకే తగలగా, ఆదోమ మెత్తగా లేచి కటాకటీగా చక్కాపోయింది. అది ఎగిరి ఎక్కడ కెడుతుందో అని దాన్నే చూస్తూ అతడు నడవడంలో — గదంతా ముసుగుముసుగుగా ఉందికాదూ! — పడుకున్నవాళ్ల కంఠాలు తొక్కాడు. 'నిన్ను తగలెయ్యాయ్' అంటూ వాళ్లు కేకలూ తిట్లతో లేచి దీపం హెచ్చుచేశారు. అది గోడమీద వాలింది. మెల్లిగా, శబ్దం చెయ్యకుండా, మాట్టాడవద్దని కడంవాళ్లకి సంజ్ఞలు చేస్తూ, అతడు వెళ్లి దాన్ని ఒక్క చెంపకాయ తీశాడు. అతిసున్నితంగా దారితీసి దోమ పారిపోయింది. అతనికి దోమతోపాటు వేళ్లుకూడా స్వాధీనంకాకుండా పోయాయి. 'అబ్బబ్బ'అని బాధపడుతూకూడా అతడు దాన్ని వదల్లేదు. ఈలోపుగా బోలెడుదోమలు అతని నెత్తెక్కి తాండవిస్తున్నాయి — ఇంత ఘటంలేదు ఇల్లెక్కి పిండికొట్టింఃనికామా, దోమసామెతా! — అతను ఇందాకటిదోమని ఒక్కదాన్నే పట్టుకున్నాడు. అది అతనికి అందకుండా దూలందగ్గిరికి ఎగిరింది. అతను ఎగర్లేక ఊరుకుని, ఈమాటు చెప్పులు కొనుక్కునేప్పుడు, దోమవేటలోకూడా ఉపయోగపడేలాగు స్ప్రింగుచెప్పులు కొనుక్కోవా లనుకున్నాడు. దానికేసే చూస్తూ, కిందకూర్చుని పుస్తకం విప్పి ఎదురుగుండా పెట్టుకున్నాడు. ఏమరుపాటుగా దానిగమనం కనిపెట్టే ఊహతో బుర్ర వంచి చదవడం అభినయించాడు. కాని, అది ఏవేపుకి ఎప్పుడు ఉడాయిస్తుందో అని పక్కబెదురుతోనే ఉన్నాడు. పాపం, అది కదిలి, దిగి, అతని చుట్టూ ఒక్కపెద్దసున్నాచుట్టి, పుస్తకంమీద ఒకవేపున వాలింది. అతనికి కొంచెం విజయందక్కేలాగ కనపడింది. 'నా అంతవాణ్ణి నువ్వు నెగ్గుతావా! అయిందిలే నీపని!' అని అత ననుకున్నాడు. మళ్లీ 'పిచ్చిగమీద బ్రహ్మాస్త్రం' అన్నట్టు 'దీనిమీదా నాశౌర్యం, పోనీ దీన్ని క్షమిద్దాం' అనుకున్నాడు. ఇంతలో పాడైపోయిన వేళ్లమాట జ్ఞాపకంవచ్చింది. ఇక పుస్తకం తప్పన మూసెయ్యడంతడువు, దోమ పైసలా అన్నమాటే అనుకున్నాడు. అయితేం, పుస్తకంయొక్క రెండుఅట్టలూ పుచ్చుగోడానికి వెళ్లడంలో కుడిచెయ్యి ఎడందానికంటె ఏ అరలిప్తో ముందు వెళ్లడంవల్లగావును పుస్తకం కొంచెం కదిలి, దోమ మళ్లీ దారెట్టింది. తపేలుమని శబ్దం అయేసరికి కునికిపాట్లుపడేవాళ్లూ తెరలో వాళ్లూ ఏ బాంబు పేలిందో ఏ తుపాకీ పెట్టి ఇతను కొట్టుకున్నాడో అని కంగారుపడి ఇతణ్ణి పట్టుగోడానికి వెళ్లారు. అతడుమాత్రం చేతులు జోడించి, నిలబడి, కళ్లు మూసుకుని ఈక్రిందిమాటలు పఠించగా తక్కినవాళ్లు నిర్ఘాంతపడి విన్నారు —

"శ్రీమన్మహాదోమ! నీపుట్టడం మండ నే నోడిపోయాను. సెగ్గింది నువ్వేను ఓ దోమరాజా యటంచుం నినున్ పెద్ద చేతుం, బలే, భేషు, వాయించు కర్ణపేయంబులౌ నీగానముల్ వర్ణనల్ సేతు, నిన్‌గూర్చి హారతుల్ వెల్గింతు, సాయంత్ర మీ నామసంకీర్తనల్ జేసి నీదివ్య చారిత్రముల్ పాడి ఏ బాడిలో నీవు మున్ పుట్టితేనేమి నీ అప్రసపత్వంబు. రాత్రించరత్వంబునం జేసి నిన్‌గూడ దైతేయవర్గంబునం జేర్చి ఆ బ్రహ్మ యంబ్రహ్మ మాకం బె మీజాతి పైజాతిగా జేసెకాబోలు! ఆమధ్య ఈమధ్య రాజ్యాలు చేసే మహాచక్రవర్తుల్ని రాజాధిరాజుల్ని సింహాసనంమీంచి మానవుల్ దింపారు, పంపారు, చంపారు! కాని, యేమానవుల్ గాని నిన్ సెగ్గుటల్ విన్పడవ్, కన్పడవ్!! నీకొక్క కైవారముం జేతు, నీకోప మింకన్ తమాయించు, నీ వెట్లు వాంఛించెదో యట్లె నా రక్తముం తోడి నీరెక్కలన్ సిక్తంబు గావించుకో గాని, అంతంతర క్తంబు పీల్చేసి పైపెచ్చు నా ఒంటి మీదన్ మలేరి హావంటివౌ వ్యాధులం దెచ్చి పాతేసి పోబోకుమీ, నీకు చాలాను పుణ్యంబు లుండున్. ఇదే స్వీకరించాలి నాదండమున్ నను్ సెగ్గి నీప్రజ్ఞ చూచే ప్రపంచానికిన్ జాటినా వికన్ నన్ను మన్నించి రక్షించు శ్రీదోమరాజా! నమస్తే నమస్తే నమః."

*

